నమస్తే తెలంగాణ

వికారాబాద్

8 | హైదరాబాద్, బుధవారం 10 జనవరి 2024 | VIKARABAD


## బ్రహ్మకుమారీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, జనవరి 9: బ్రహ్మకుమారీస్ విశ్వ విద్యాలయం వారి 2024 సంవత్సరం క్యాలెండర్లను మంగళవారం పరిగిలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యాబాజీగూడ సర్పంచ్ ప్రవీణ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశం, బ్రహ్మకుమారీస్ పరిగి కేంద్రం ఇన్‌చార్జి పద్మక్క, నాయకులు రవికుమార్, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## నాపరాయి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి




ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న స్టోన్ వ్యాపారస్తులు

తాండూరు రూరల్, జనవరి 9 : నాపరాయి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు మండల క్వారీ అసోసియేషన్, స్టోన్ వ్యాపారస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు నాపరాయికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. క్వారీ యజమానులు, స్టోన్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండల క్వారీ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, కార్యదర్శి సయ్యద్ జుబేర్ పాషా, కోశాధికారి మహ్మద్ జైనొద్దీన్, స్టోన్ అధ్యక్షులు నయ్యూం, కార్యదర్శి మేరాజ్ ఫైయాజ్ , కోశాధికారి జీవన్, డాక్టర్ సంపత్, సోమాని ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు క్లోజ్



- జిల్లావ్యాప్తంగా 42,655 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- ఇప్పటి వరకు 80 కొనుగోలు కేంద్రాల్లో సేకరణ బంద్
- జిల్లాలో 120 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- 8549 మంది రైతుల నుంచి రూ.93.97 కోట్ల విలువైన ధాన్యం సేకరణ
- పెండింగ్‌లో రూ.18.59 కోట్ల చెల్లింపులు
- రైస్ మిల్లులకు 42,332 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలింపు
- 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు
- వానకాలంలో వరి సాగు విస్తీర్ణం 1.33 లక్షల ఎకరాలు

వికారాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : వానకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తైంది. జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనా వేసిన దానిలో 25 శాతం కూడా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాకపోవడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా 122 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రతిపాదించినప్పటికీ 120 కొనుగోలు కేంద్రాలను జిల్లా యంత్రాంగం ప్రారంభించింది. ధాన్యం కొనుగోలు సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావడంతో జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 80 కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. మరో రెండు రోజుల్లో మిగిలిన కేంద్రాలనూ మూసివేయనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరోవైపు ధాన్యాన్ని విక్రయించిన రైతులకు రెండు, మూడు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వారం రోజులు దాటుతున్నా చెల్లించకపోవడంతో రైతులు డబ్బులు కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ధాన్యాన్ని విక్రయించి పది రోజులైనా డబ్బులు ఖాతాల్లో జమ కాలేదంటున్నారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు 93.97 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, రూ.18 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. వానకాలం సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి మొత్తం 'ఏ' గ్రేడ్ రకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు.

**42,655 మెట్రిక్ టన్నుల సేకరణ..**

జిల్లాలో వానకాలం సీజన్‌కుగాను వరి ధాన్యం సేకరణ పూర్తైంది. జిల్లావ్యాప్తంగా 120 కొనుగోలు కేంద్రాల్లో 42,655 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 10,285 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 14,354 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 15,896 మెట్రిక్ టన్నులు, ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 2120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని 59 రైస్‌మిల్లులకు ఇప్పటి వరకు 42,332 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సరఫరా చేశారు. వానకాలం సీజన్‌కుగాను మద్దతు ధరను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం గ్రేడ్ 'ఏ' రకం క్వింటాలుకు రూ.2203, సాధారణ రకం రూ.2183గా నిర్ణయించింది. గతేడాది వరకు గ్రేడ్-ఏ రకం రూ.2060, సాధారణం రూ.2040గా ధాన్యాన్ని సేకరించారు. జిల్లాలో వానకాలం సీజన్‌కుగాను 80 వేల మంది రైతులు 1.33 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా, కేవలం 42,655 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు రావడం గమనార్హం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా వరి సాగు చేసిన 4-5 గ్రామాలకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒకే రోజు రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి రాకుండా కొనుగోలు కేంద్రం వద్ద ఐదుగురు చొప్పున రైతులుండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకొని ధాన్యాన్ని ఎప్పుడు తీసుకురావాలనేది తేదితో కూడిన టోకెన్లను అందజేసి జాగ్రత్త పడ్డారు. ఈ ఏడాది రైతులు 1.34 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఎక్కువగా పరిగి, కుల్కచర్ల, దోమ, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కొడంగల్, తాండూరు, యాలాల, ధారూరు, మర్పల్లి, కోట్‌పల్లి మండలాల్లో అధికంగా వరి సాగు చేశారు.

## 29 నుంచి క్రీడాపోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న మండల జడ్పీటీసీ ధారాసింగ్

పెద్దేముల్, జనవరి 9 : ఈ నెల 29, 30,31 తేదీల్లో మండల స్థాయిలో అన్ని ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ ధారాసింగ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 6,7,8 తరగతుల విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో, 9,10 తరగతుల విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, శోభమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు నసీరోద్దీన్, డీవై నర్సింహులు, వడ్ల ఆనందం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## 14, 15 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కులకచర్ల, జనవరి 9 : ఈ నెల 14, 15 తేదీల్లో మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇప్పాయిపల్లి వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, ఆర్గనైజర్లు రాంజీ, వెంకట్‌రెడ్డి, యాదయ్య, ఆనంద్, రాంచంద్రయ్య, రాములు తెలిపారు. ఇప్పాయిపల్లి వాలీబాల్ అసోసియేషన్ గ్రౌండ్‌లో ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ. 20వేలు, రెండో బహుమతి రూ. 10వేలు, మూడో బహుమతి రూ. ఐదువేలు నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 9441726991 నంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

## పశువులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ధారూరు, జనవరి 9: పశువుల పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశు సంవర్ధక శాఖ విశ్రాంత అధికారి డాక్టర్ పున్నయ్య అన్నారు. మంగళవారం ధారూరు మండల పరిధిలోని హరిదాస్‌పల్లి, నర్సాపూర్ గ్రామాల్లో సత్యసాయి సేవా సమితి, కేరెల్లి పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు ఉచితంగా చికిత్సలు అందించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ నాగసముందర్ డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ పద్మాకర్ రావు, డాక్టర్ శ్రీకర్ రెడ్డి, డాక్టర్ హాథిరామ్, పశు సంవర్ధక శాఖ పారా మెడికల్ సిబ్బంది, సత్య సాయి సేవా సంస్థలు సేవాదల్ సభ్యులు సీహెచ్ నరేష్, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## సీఎం ఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్‌గా లచ్చిరెడ్డి బాధ్యతలు



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న వీఆర్‌ఏలు

వికారాబాద్, జనవరి 9 : సీఎం ఆర్వో ప్రాజెక్ట్ డైరెక్టర్(సీసీఎల్ఏ)గా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ, వీఆర్‌ఏలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైన సందర్భంలో రెవెన్యూ వ్యవస్థపై పూర్తిగా పట్టు ఉన్న తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లచ్చిరెడ్డిని నియమించడం చాలా శుభపరిణామమన్నారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతమవుతుందని.. రాష్ట్రంలోని రైతులందరికీ న్యాయం జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి నాయకులు విజయ్ సతీష్, చిరంజీవి, అశోక్, శివరాం పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 9 : జిల్లా అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో చేపడుతున్న పనుల పురోగతి, ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అవసరాలు తీర్చే దిశగా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలన్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్ ఆర్‌అండ్‌బీ శాఖల ద్వారా చేపడుతున్న పనుల నివేదికను సమర్పించాలని, పాలనపరమైన అనుమతులు వచ్చిన పనులు వెంటనే గ్రౌండింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసరంగా చేయవలిసిన పనులు ఏవైనా ఉంటే వాటి ప్రాధాన్యతను బట్టి జాబితాను రూపొందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక అవసరాల నిమిత్తం వినియోగించే దిశగా భూసేకరణ చేపట్టాలని, ఇంటర్నేషనల్ స్కూల్స్ మంజూరు అవుతున్న నేపథ్యంలో మండల కేంద్రాల్లో 10 ఎకరాల భూసేకరణకు చర్య తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పారిశ్రామిక రంగాలను నెలకొల్పేందుకు 10 ఎకరాలకు తక్కువ కాకుండా భూముల వివరాలను వారం రోజుల్లోగా రికార్డులతో సహా ప్రతిపాదన రూపొందించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారులకు, రైల్వే పనులకు సంబంధించి స్థల సేకరణలో జాప్యం వహించకుండా వారం రోజుల్లోగా భూ సేకరణ చేసి నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలోని ప్రతి శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల వివరాలు ఉన్నతాధికారులకు సూచించాలని ఆయన తెలిపారు. జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి అగ్రికల్చరల్ యూనివర్సిటీ అధికారుల సలహాలు, సహకారం తీసుకొని అనువైన పంటలు వేసేందుకు అంచనాల రూపొందించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురుకుల పాఠశాలలు, కాలేజీలను వారం రోజుల్లోగా సంబంధిత నియోజకవర్గాల పరిధిలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంజూరైన గురుకుల పాఠశాలకు, కాలేజీలకు వారం రోజుల్లోగా భూముల కేటాయింపు జరగాలని కలెక్టర్ తెలిపారు. మన ఊరు మనబడి కింద చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల జాబితాలను రూపొందించాలని పేర్కొన్నారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. స్టడీ మెటీరియల్, స్నాక్స్ ఇతరత్రా సదుపాయాలను విద్యార్థులకు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ దవాఖానరల్లో ఆశ వర్కర్లు, సిబ్బంది ఖాళీల జాబితాను రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. దవాఖానల భవనాలు, కావాల్సిన వైద్య పరికరాలపై నివేదిక రూపొందించాలన్నారు. ఆసుపత్రిలో వాటర్ ప్లాంట్ జనరేటర్, సదుపాయం కోసం ప్రతిపాదన ఇవ్వాలని కలెక్టర్ వైద్యాధికారికి సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాసరావు, వివిధ శాఖల ఇంజినీర్ విభాగాల అధికారులు, జిల్లా, మండలాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఆయా శాఖల అధికారులు

## బయట పిల్లలు బడిలో చేరిక

బొంరాస్‌పేట, జనవరి 9 : మండలంలోని భోజన్నగడ్డ తండా సమీపంలోని ఇటుక బట్టీలో పని చేస్తున్న కార్మికుల పిల్లలు ఉమ, మాధవ్, బేబి ముగ్గురు బడి బయట ఉన్నట్లు గుర్తించి వారిని భోజన్నగడ్డ తండా పాఠశాలలో చేర్పించి పుస్తకాలు అందించారు. తుంకిమెట్లలో కూడా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీ సోమ్లా, హెచ్ఎం వెంకటేశ్, ఐఈడీ టీచర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## 'దళితబంధు'పై నేడు ధర్నా

కొడంగల్, జనవరి 9: దళితబంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు ఆ పథకాన్ని అమలు చేయాలని దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ ఎరన్‌పల్లి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'దళిత బంధు'ను కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాని డిమాండ్ చేశారు. నేడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు.


**నిధులు ఇవ్వాలి**

పూడూరు : దళితబంధు లబ్ధిదారులకు వెంటనే నిధులు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రొసీడింగ్‌లను అందజేసినట్లు ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులను విస్మరించిందన్నారు. నేడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

## బైకు ఢీకొని వృద్ధుడి మృతి

బొంరాస్‌పేట, జనవరి 9 : బైకు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై శంకర్ కథనం ప్రకారం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతకింది బసయ్య(75) సోమవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా కట్టుకాల్వ తండాకు చెందిన ప్రకాశ్ నాయక్ బైకుతో వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కొడుకు హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

## శిఖం భూమిని కాపాడాలి



తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాఘవేందర్‌గౌడ్

కులకచర్ల, జనవరి 9 : మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామంలో ఉన్న శిఖం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ మంగళవారం తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఘనాపూర్‌లోని 125 సర్వే నంబర్‌లో శిఖం భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉందని, కొందరు కబ్జా చేశారని తెలిపారు.

## పెండింగ్ చలాన్ల చెల్లింపునకు నేడే చివరి గడువు

పెద్దేముల్, జనవరి 9 : వాహనదారులు పెండింగ్ చలాన్లు చెల్లించుకోవడానికి బుధవారం చివరి తేదీ అని తాండూరు రూరల్ సీఐ రాంబాబు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాల పెండింగ్ చలాన్లను చెల్లించుకోవాలని సూచించారు.

## కొనసాగుతున్న డాటా ఎంట్రీ

బొంరాస్‌పేట, జనవరి 9 : బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో నిర్వహించిన ప్రజా పాలనలో 16365 దరఖాస్తులు వచ్చాయి. వీటిని బొంరాస్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శుల సహాయంతో డాటా ఎంట్రీ చేయిస్తున్నారు. రాత్రింబవళ్లు ఈ కార్యక్రమం కొనసాగుతున్నది. మంగళవారం డాటా ఎంట్రీ పనులను ప్రజా పాలన ప్రత్యేకాధికారి రాంరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్ పరిశీలించారు.


## రూ. ఏడు లక్షల ఎల్వోసీ అందజేత



ఎల్వోసీని అందజేస్తున్న జడ్పీటీసీ ధారాసింగ్

పెద్దేముల్, జనవరి 9 : మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అలీ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ పట్టణంలోని ఓ దవాఖానాలో చికిత్స పొందుతున్నాడు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని ఆశ్రయించగా రూ. ఏడు లక్షల రూపాయల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఎల్వోసీని జడ్పీటీసీ ధారాసింగ్ బాధితుడి కుటుంబానికి మంగళవారం అందించారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి, జనవరి 9: పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కుంగిపోవద్దని, పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు శేఖర్, ఉమారాణి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ రవీందర్, సొసైటీ డైరెక్టర్ యాదయ్య, మాజీ వైస్ ఎంపీపీ అంజయ్య గౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు..

## కమీషన్ డబ్బుల అవకతవకలపై విచారణ



మహిళల సమక్షంలో విచారణ చేస్తున్న అధికారులు

బొంరాస్‌పేట, జనవరి 9 : మండలంలోని బురాన్‌పూర్ రెండవ గ్రామ సంఘానికి వచ్చిన ధాన్యం కమీషన్ డబ్బుల అవకతవకలపై మంగళవారం డీఆర్‌డీఏ ఏపీడీ నర్సింహులు, సీబీవో ఆడిటర్ ప్రవీణ్‌రెడ్డి బొంరాస్‌పేటలో విచారణ నిర్వహించారు. రెండవ గ్రామ సంఘం మహిళలు గ్రామంలో ధాన్యం కొనుగోలు చేపట్టగా సంఘానికి సుమారు రూ.11లక్షలు కమీషన్ వచ్చింది. కమీషన్ డబ్బులలో కొంత మొత్తాన్ని ఒక జిల్లా అధికారి ఖాతాకు బదిలీ చేశారని, ఇట్టి డబ్బుల వివరాలను బుక్ కీపర్ తమకు తెలపడం లేదని, విచారణ చేసి తమకు న్యాయం చేయాలని మహిళలు గత ఏడాది డిసెంబర్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై అధికారులు మంగళవారం బొంరాస్‌పేటకు వచ్చి మహిళలు, గ్రామస్తుల సమక్షంలో విచారణ నిర్వహించారు. కమీషన్ డబ్బులు దేనికి ఖర్చు చేశారు, ఎవరు డ్రా చేశారు అనే విషయాలపై చాలా సేపు చర్చించినా అధికారులు ఏమీ తేల్చలేదు. గ్రామం నుంచి వచ్చిన నాయకులు కూడా కమీషన్ డబ్బులను మహిళలకు తెలియకుండా దుర్వినియోగం చేసి సభ్యులకు అన్యాయం చేశారని, డబ్బులు ఎక్కడికి వెళ్లాయో అధికారులు తేల్చి మహిళలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. వచ్చిన కమీషన్ డబ్బులను గ్రామ సంఘం బాధ్యులు దేనికి ఖర్చు చేశారో వివరంగా లెక్కలు తీయాలని, శుక్రవారం మళ్లీ వచ్చి విచారణ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. విచారణలో ఐకేపీ ఏపీఎం నర్సింహులు, ఎంపీటీసీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు ప్రకాశ్‌గౌడ్, సంగప్ప, నర్సింహులు, మహిళలు పాల్గొన్నారు.

## వ్యక్తి దారుణ హత్య





ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో మృతుడు వీరారెడ్డి)

తాండూరు, జనవరి 9 : తాండూరు పట్టణంలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి మర్మాంగాలపై బలంగా తన్ని హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ వివరాల ప్రకారం.. ధారూరు మండలం నాగారం గ్రామానికి చెందిన జే వీరారెడ్డి(43) కొన్ని నెలలుగా తాండూరు పట్టణం కుమార్ గల్లీలో ఉంటూ కూలీపని చేసి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఫయాజ్ పెట్రోల్ పంప్ వద్ద వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబు, పట్టణ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వద్ద దొరికిన ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి నరసింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

## హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

వికారాబాద్, జనవరి 9 : వికారాబాద్ జిల్లాలో 25 మంది కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి సీనియార్టీని బట్టి బదిలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం అందేలా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏవో జ్యోతిర్మణి, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, జిల్లా పోలీస్ అధ్యక్షుడు అశోక్, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి